జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 29 జూలై 2024
www.ntnews.com


# ఆకాశమే హద్దు.. అవకాశం వదలొద్దు!

గీతావాక్యం

యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే।
తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః॥
(భగవద్గీత 2-46)

అన్ని వైపులా జలాలతో నిండి ఉన్న జలాశయాలు అందుబాటులో ఉన్నవాడికి చిన్న చిన్న జలాశయాల వల్ల ఎంత ప్రయోజనమో.. పరమానందకరుడైన పరమాత్మ ప్రాప్తి పొంది.. పరమానందాన్ని అనుభవించే బ్రహ్మజ్ఞానికి వేదాల వల్ల అంతే ఫలం.

వేదం అంటే తెలుసుకోదగినది. తెలుసుకోవాలి అంటే పుస్తకాలు చదవాలి. పుస్తకాల అవసరం ఎంతవరకంటే?.. అందులోని జ్ఞానం అవగతం అయ్యేంత వరకు మాత్రమే. తరువాత.. పుస్తకంతో పనిలేదు. అలాగే బ్రహ్మజ్ఞానాన్ని సాధించాలి అంటే.. వేదమే మార్గం కాని, బ్రహ్మజ్ఞానం కలిగాక వేదంతో పనిలేదు.. అంటే వేదాన్ని నిరసించమని కాదు. ఆ పరిధిలోనే ఉండిపోకూడదని మాత్రమే. ఒక విషయంపై పరిశోధన చేయాలి అంటే అక్షరాలు అవసరం అవుతాయి. కాని అక్కడే ఆగిపోతే.. పరిశోధన దాకా సాగలేం.

'అహం బ్రహ్మాస్మి' అంటుంది వేదం. 'నేనే బ్రహ్మమును అయి ఉన్నాను' అని. భగవంతుడి అంశగా భూమిపై జన్మించిన మనందరిలోనూ ఆ లక్షణాలన్నీ నిక్షిప్తమై ఉన్నాయి. వాటిని గుర్తించడం, వాటిని ఉపయోగించుకోవడంలో మనమంతా వెనుకబడి ఉన్నాం. నిజానికి మన అంతర్గత శక్తిసామర్థ్యాలు మనం పెంచుకున్న నైపుణ్యాల పరిధి కన్నా చాలా ఎక్కువ. ప్రస్తుతం కొంతపని చేయగలుగుతున్నాం.. ఇంక కొంత ప్రయత్నిస్తే అంతకన్నా ఎక్కువ ఫలితాలను సాధించగలం. మరింత ప్రయత్నిస్తే.. మరింత ఎక్కువ ఫలితాన్ని పొందగలం. కాని మన సామర్థ్యాన్ని అంచనా వేసుకోవడంలో విఫలమవడం వల్ల మన శక్తిసామర్థ్యాలను తక్కువ స్థాయిలో ఉపయోగించుకుంటున్నాం.

వ్యక్తి ఆలోచనా సరళే వారి జీవిత గమనాన్ని నిర్ణయిస్తుంది. 'జపనీస్ కోయ్' అనే చేప పుట్టినప్పుడు ఒకటి నుంచి ఒకటిన్నర అంగుళాల పొడుగు ఉంటుంది. దానిని చిన్న బకెట్లో వేస్తే అది దాని జీవితకాలంలో రెండు నుంచి మూడు అంగుళాలు పెరుగుతుంది. దానిని పెద్ద టబ్బులో వేస్తే తన జీవితకాలంలో ఆరు నుంచి ఎనిమిది అంగుళాలు పెరుగుతుంది. అదే చేపను చెరువులో వేస్తే.. తన జీవితకాలంలో మూడు అడుగుల వరకు పెరుగుతుంది. దానిపై పరిశోధన చేసిన శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం.. ఆ చేప తన పరిమితులను తానే నిర్ధారించుకుంటుందని. బకెట్లో వేసినప్పుడు అదే తన పరిధిగా భావించి అక్కడే పెరుగుదలను నియంత్రించుకుంది. అదే చెరువులో దాని పరిమితిని మరింత విస్తృతపరుచుకుంటుంది.

చేప ఎలాగైతే తన పరిమితులను తన ఆలోచనా పరిధిలో నిర్ధారించుకుంటుందో అలాగే మానవులూ తమ ఆలోచనల పరిధిలో అభ్యుదయాన్ని సాధిస్తారు. చేప ఆలోచనా పరిమితులు దాని భౌతిక ఎదుగుదలపై ప్రభావాన్ని చూపుతాయి.. అదే మానవుల ఆలోచనా పరిమితులు వారి మేధ, భావోద్వేగాలపై ప్రభావాన్ని చూపుతాయి. కుత్సితమై, కుంచించుకుపోయిన ఆలోచనల పరిధులను, పరిమితులను చెరిపివేసుకొని విస్తృతపరిధిలో ఆలోచించగలిగిన వ్యక్తి పరిణతికి, అభ్యుదయానికి ఆకాశమే హద్దు. మేధ, భౌతిక శరీరం.. రెండూ పరిమితులకు లోబడినవే అనుకున్నా.. ఆత్మపరంగా ప్రతి వ్యక్తీ అనంతత్వానికి చెందినవాడే. కాకపోతే జీవితమనేది పరిమితత్వానికి అపరిమితత్వానికి మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది.



యోగమైనా భోగమైనా.. బంధనాలైనా, స్వేచ్ఛ అయినా మానసికమైనవే! వాటిని గుర్తించి.. ఆ పరిమితులను చెరిపివేసుకోగలిగితే.. ఒక స్టీఫన్ హాకింగ్ కావచ్చు.. హెలెన్ కిల్లర్ కావచ్చు.. ఆల్వా ఎడిసన్ కావచ్చు. నిజానికి వీరందరికీ పరిమితులు ఉన్నాయి. కాని వారు ఆ పరిమితులను అధిగమించి అపరిమితత్వాన్ని చేరుకోగలిగారు. మనమంతా మన ఆలోచనా పరిమితుల కన్నా ఎన్నో రెట్లు అధికమైన శక్తిసామర్థ్యాలు కలిగిన వారమే. యువత ఈ విషయాన్ని గుర్తించి తమ పరిమితులను, పరిధులను చెరిపివేసుకుంటే.. నవ సమాజం ఆవిష్కృతమవుతుంది.

... పాలకుర్తి రామమూర్తి

# ఆనంద రహస్యం

కథాసుధ

ఓ పారిశ్రామికవేత్త ఒకానొకసారి తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. మానసిక ప్రశాంతత కోరి ఎక్కడెక్కడో తిరిగి చివరికి ఒక ఆశ్రమానికి చేరుకున్నాడు. అక్కడ గురువును కలిసి తనకు ఆనందంగా ఉండాలని ఉందని చెప్పాడు. ఎన్నో పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలు తిరిగినా తాను కోరుకున్న ఉపశమనం లభించలేదని బాధగా అన్నాడు. అప్పుడు గురువు 'నీకో కథ చెబుతాను.. విను' అంటూ ఇలా చెప్పాడు. 'ఒకరోజు సముద్రంలోని చేపలు సమావేశమయ్యాయి. 'మనలో ఎవరైనా సముద్రాన్ని చూశాయా?' అనే చర్చను మొదలుబెట్టాయి. అక్కడ చేరిన చేపలేవీ 'సముద్రాన్ని చూశాం!' అని చెప్పలేకపోయాయి. 'అయ్యో... ఇంత బతుకు బతికి సముద్రాన్ని చూడలేకపోయామే...' అని బాధపడటం ప్రారంభించాయి. ఇంతలో ఒక చేప మా ముత్తాత సముద్రాన్ని చూశాడని మా అవ్వ చెప్పేది అన్నది. అప్పుడు రెండో చేప నిజమే, వాళ్ల ముత్తాత సముద్రాన్ని చూసినట్లు నేను కూడా విన్నాను అని సమర్థించింది. మూడో చేప ఇది ముమ్మాటికీ వాస్తవం. ఎందుకంటే మా బంధువులు కూడా ఆ విషయాన్ని చెప్పుకొంటూ ఉండగా విన్నాను అన్నది. అప్పుడు చేపలన్నీ ఫర్వాలేదు.. సముద్రాన్ని చూసిన వాళ్ల తాలూకు వారు మన సమూహంలో ఉన్నారని గర్వించాయి. మొదటి చేపను ఎత్తుకుని ఊరేగించాయి. చివరిగా అన్ని చేపలూ చేరి ఆ చేప ముత్తాత బొమ్మ చేసి పూజలు ప్రారంభించాయి' అని చెప్పాడు.

ఈ కథ వినగానే ఆ పారిశ్రామికవేత్త.. 'అదేమిటి? ఆ చేపలు ఉన్నది సముద్రంలోనే కదా! సముద్రంలోని చేప, సముద్రం కోసం వెదకడమేమిటి? ఆ చేపలు అంత మాత్రం గుర్తించలేకపోయాయా?' అని ఆశ్చర్యపోతూ గురువును ప్రశ్నించాడు. గురువు మళ్లీ నవ్వి 'మనల్ని ప్రకృతి సృష్టించిందే ఆనందకరమైన జీవితాన్ని గడపమని. మనమే ఏదేదో ఆలోచించి ఆనందానికి దూరమైపోతున్నాం. ఆనందమనేది ఎక్కడో ఉండదు, ఏ వస్తువులోనూ దొరకదు. ఏ ప్రదేశంలోనూ చిక్కదు. అది మనలో నుంచే రావాలి. ఎందుకంటే మనం ఆనంద స్వరూపులం కాబట్టి! 'నాది' అని... దేన్నీ గట్టిగా పట్టుకోకుండా భూత భవిష్యత్తు కాలాల్ని విడిచి పెట్టి వర్తమానంలో ఉంటే ఆ ఆనందం అనేది మనలోనే దొరుకుతుంది. దానికోసం ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు. ఎవరినీ అడగాల్సిన అవసరమూ లేదు' అని వివరించాడు. ఆనంద రహస్యం తెలుసుకున్న ఆ పారిశ్రామికవేత్త.. గురువుకు నమస్కరించి తృప్తిగా ఆశ్రమం నుంచి కదిలాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821





# అజ్ఞాన హరణమే.. అంబర అపహరణం!



మన పోతన 179 మధురిమ వ భాగం

**శ్రీమద్భాగవతం శ్రీకృష్ణలీలామృత సాగరం. ఈ లీలలన్నీ అప్రాకృతాలు- అభౌతికాలు, చిన్మయాలు. అధ్యాత్మ తత్త్వ రహస్య భావనాగర్భితాలు. అనంత రస వర్షకాలు. అవి భౌతికాల వలె కనిపించినా చక్కగా విచారణ జరిపితే జీవుల భౌతిక- ప్రాపంచిక వాసనలను, జీవత్వాన్ని పూర్తిగా తొలగించి చిన్మయత్వాన్ని ప్రసాదిస్తాయి. జీవుల కర్మలు కర్తృత్వ బుద్ధి (అహంకారం)తోను, స్వార్థం (మమకారం)తోను కూడి ఉంటాయి. కనుక, అవి బంధకాలు- జన్మ సంసార బంధనాలు కలిగిస్తాయి. కాని, (జన్మకర్మ చ మే దివ్యం- గీత) దేవదేవుని కర్మలు దివ్యములు. కాన మోచకాలు- జీవుల బంధనాలు తొలగిస్తాయి. వీటికి 'లీలలు' అని పేరు. 'లయనం లాతి ఇతి లీలా'- మనస్సును లయింపజేసి ముక్తిని కలిగించేదే లీల.**

'మనోనాశో మహోదయః'- మనస్సు నశించుటే మోక్షమని శాస్త్రం. అయితే, బాలకృష్ణుని లీలా విమర్శ చేసేటప్పుడు అతని నామ, రూప, గుణ చేష్టలు ప్రాకృతాలు- పాంచభౌతికాలు కావు అన్న విషయం చాలా ముఖ్యం. 'న భూత సంఘ సంస్థానో దేవస్య పరమాత్మనః..' అని మహాభారతంలో వ్యాస వచనం. 'దామోదర భగవంతునిలో 'దేహము- దేహి' అన్న భేదం ఉండదు. ఆయన శరీరం పాంచ భౌతికం కాదు. అలా భూత సముదాయంగా భావించేవారు కర్మాధికారాన్ని కోల్పోతారు. అట్టివారి ముఖం చూసినా సచేల స్నానం చెయ్యాలి'. అంటే, అది అంతగా దోషావహమన్నమాట! భాగవతంలోని నవనీత చౌర్యం, చీర (వస్త్ర) హరణం, రాస లీల- ఇవన్నీ దివ్య చిన్మయి లీలలు. కాని, అధిక ఆక్షేపణకు, అపార్థాలకు గురైన ఘట్టాలు.

సారసాక్షులు- గోపికలు యమునలో స్నానాలు చేస్తుంటే వారిజాక్షుడు కృష్ణుడు ఆ కామినుల చీరలు హరించుకపోవడం అశ్లీలం, అయోగ్యం, అసభ్యం కాదా?- అని అధిక్షేపం, నింద. నిజమే మరి! అజుడు, సర్వేశ్వరుడు శ్రీహరి చేశాడు కాన సరిపోయింది. కాని, ఒరుడు- మానవ మాత్రుడైతే అది దానవ చేష్ట- దుర్మార్గమేగా మరి? గోప కుమారికలే... 'ఓ నందగోప కుమారా! కుందరదనలు- స్త్రీలు ఆనందంగా జలకాలాడుతుంటే, ఆ చాయలకు మగవారు రావడం తుంటరితనం కాదా? వచ్చి వారిని ఇలా అల్లరి పెట్టొచ్చునా?' అని అడిగారు. మహాభారతంలోని ద్రౌపదీ వస్త్రాపహరణం దుష్టచతుష్టయ దురాగతం. అది నీచం, నికృష్టం. పరాత్పరుని కరావలంబనంతో- ప్రశస్తమైన అక్షయ చీర- వస్త్రదానంతో అది ఘోరంగా నిరస్తం- విఫలమైపోయింది. 'పాంచాలీ కబరీ వికర్షణ మహాపాప క్షతాయుష్కులన్' అన్నాడు అమాత్యుడు పోతన్న. నిండుసభలో యాజ్ఞసేని- ద్రౌపది వేణి పట్టి లాగిన మహాపాపం వల్లనే కౌరవుల ఆయుస్సులు క్షీణించాయి, వట్టిపోయాయి. కాని, భాగవత గోపికా చీరహరణం భగవంతుని- యదువీరుని లీల! నిష్కలుడైన కృష్ణానుగ్రహంతో అది పుష్కలంగా ఫలించింది. భాగవతం భగవత్తత్త్వ ప్రతిపాదకం. మోక్ష గ్రంథం. భాగవత కర్త విశాల బుద్ధి వేదవ్యాసుడు, అపర నారాయణుడు. వక్త- బోధక చక్రవర్తి, అవధూత... శుక బ్రహ్మ. శ్రోత- ముముక్షువై ప్రాయోపవిష్టుడైన సాధక శిరోమణి పరీక్షిత్తు. అదీకాక, 'భక్త్యా భాగవతం, జ్ఞేయం'- భాగవతం భక్తి భావ గమ్యం. భాషా, పాండిత్య గమ్యం కాదు. 'భగవత్తత్త్వం అలౌకికం. దానిని ప్రతిపాదించడానికి 'అలౌకిక' భాష అంటూ ఒకటి ప్రత్యేకంగా లేదుగా మరి! కనుకనే లౌకిక భాషలోనే అలౌకిక తత్త్వాన్ని తెలియపరచవలసి వచ్చింది' అంటూ చక్కగా శెలవిచ్చారు భూమానంద ఆశ్రమస్వామి శ్రీరామకృష్ణానంద.

భాగవత భాషను 'సమాధి భాషా వ్యాసస్య'- సమాధి భాషగా వక్కాణించారు వల్లభాచార్య స్వామి. పరమార్థాన్ని- ఉత్కృష్టమైన బ్రహ్మనిష్ఠకు సంబంధించిన ప్రతిభను, ప్రాభవాన్ని ప్రతిబింబింప జేసేదే సమాధి భాష. ఈ ఘట్టంలోని గోపికలు గోపికలు కారు. కృష్ణుడు కేవలం యశోదానందనుడు కాడు. 'నఖలు గోపికా నందనో భవాన్'- 'నీవు యశోద బిడ్డడవే? నీజరనేత్ర! సమస్త జంతు చే/ తో విదితాత్మ వీశుడవు..' (కమలాక్షా! నీవు కేవలం యశోద కుమారుడవే కాదయ్యా! అఖిల దేహధారుల బుద్ధికి సాక్షీభూతుడవైన అంతరాత్మవు, పరమేశ్వరుడవు) అని గోపికలు గానం చేశారు. ఆయన గ్రహించిన వస్త్రాలు వస్త్రాలూ కావు. ఇవన్నీ పరమార్థానికి ప్రతీకలు. ఇదంతా సాంకేతిక భాష, భక్తి భాష! త్రిగుణాలతో కూడిన జీవులందరూ గోపికలే, స్త్రీలే. సృష్టిలో జగన్నాథుడు ఒక్కడే పురుషుడు- గుణాతీతుడైన పురుషోత్తముడు! వస్త్రమంటే ఆవరణం- అజ్ఞానం, దేహాత్మ బుద్ధి. దేహమే నా స్వరూపమనే అభిమానం- అహంకారం. వస్త్రం దేహాన్ని కప్పునట్లు దేహం (దేహాత్మబుద్ధి, అజ్ఞానం) ఆత్మని, స్వరూపాన్ని- జ్ఞానాన్ని ఆవరించి ఉంది. 'అజ్ఞానేన ఆవృతం జ్ఞానం'- గీత. జీవుల అజ్ఞాన ఆవరణాన్ని- తస్కరించడమే గోపికల అంబర (వస్త్ర) అపహరణ! 'దదామి బుద్ధి యోగం'- గీత. బుద్ధి యోగం ఇవ్వడమంటే ఇదే.

చీరహరణ, రాసలీల ప్రసంగాలలో భక్తకవి పోతన కవితా చేతనా స్రవంతి భక్తి జ్ఞాన వైరాగ్యాలతో ముప్పిరిగొని త్రివేణియై వెల్లివిరిసి భావుక భక్తుల హృదయ కేదారా-క్షేత్రాలలో బ్రహ్మానందపు పంట పండించింది. 'హేమంతే ప్రథమే మాసి' (హేమంత రుతువు మొదటి నెల మార్గశిరంలో) అని మాత్రమే మూలపాఠం. సహజ పాండిత్యుడు పోతన్న రుతు స్వభావాన్ని- ప్రకృతి ధర్మాల మర్మాలను ఆరు కందాలలో, రెండు ఆటవెలదులలో, ఒక వృత్తంలోనూ విస్తరించి కమనీయ కల్పనలతో కావ్యాత్మకంగా ఎంతో రమణీయంగా ప్రస్తుతించాడు. శుకుడు పరీక్షిత్తుతో..

**కం॥ 'శామంతికా స్రగంచిత**
**సీమంతవతీ కుచోష్ణ జితశీత భయ**
**శ్రీమంతంబయి గొబ్బున**
**హేమంతము దోచె, మదనుడేచె విరహులన్'**

'రాజా! హర్షంతో కూడిన వర్ష, శరదృతువులు గడచిపోగా అంతలోనే శ్రీమంతమైన హేమంతం- శీతకాలం రానే వచ్చింది. చేమంతి పూబంతులు పూనిన (ధరించిన) సీమంతినుల (భార్యల) కుచముల పొత్తు వలని వేడిమిచే పురుషులకు చలిభయం చిత్తు-చిత్తుగా ఓడి మత్తుగా వీడిపోయింది. అదను చూసుకొని మదనుడు- మన్మథుడు పాగా వేసి కదం తొక్కుతూ విరహులను దయారహితంగా బాగా వేధించాడు'. ఉత్తరపు గాలులు వీచాయి. మింట చందురుడు మంటలు రేపాడు. దంపతులకు ఇంపుగా పొత్తు కుదిరింది. అంతటా మంచు అలముకొనడం చేత తామరలకు శోభ తరిగిపోయింది. పగటి వేళలు సన్నగిల్లి రాత్రి పొద్దులు హద్దులు మీరాయి. భగ్గున మండే అగ్గి చలి ఎగ్గు (బాధ)ను తొలగించి అందరికీ హాయిని కూర్చింది.

**ఆ॥ 'శంభు కంటి నొకటి జలరాశి నొక్కటి**
**మరియు నొకటి మనుజ మందిరముల**
**నొదిగెగాక మెరసియున్న మూడగ్నులు**
**చలికి నులికి భక్తి సలుపకున్నె?'**

రాజా! చలిదెబ్బకు ఉలికిపడి (భయపడి) ఇల- లోకంలోని మూడు అగ్నులలో ఆహవనీయమనే అగ్ని అహిభూషణుని, మహాదేవుని, అంతకాంతకుని- శివుని చెంతచేరి అంతలోనే ఆయన అగ్నినేత్రంలో అణగిపోయింది. గార్హపత్య అగ్ని గృహస్థుల సదనాల (ఇళ్ల)లో ఒదిగిపోయింది. దక్షిణాగ్ని సాగరుని కుక్షిలో చొచ్చి బడబాగ్నిగా నిక్షిప్తమైపోయింది. అలాకాక అవి వెలుపలే ఉండి ఉంటే చలికి చిక్కి పలువిధాల దానికి సేవలు చేస్తూ ఉండేవే!

**శా॥ 'ఈ హేమంతపు రాకజూచి రమణీ హేలా పరీరంభ స**
**త్సాహాయంబున గాని దీని గెలువన్ శక్యంబు గాదంచు దా**
**రూహాపోహ విధిం ద్రిమూర్తులు సతీయుక్తాంగులైనారుగా**
**కోహో! వారల దేమి సంతత వధూయోగంబు రా గందురే?'**

బ్రహ్మవిష్ణు మహేశ్వరులు కూడా హేమంతపు రాకను చూచి, తమ తరుణీమణుల బిగి కౌగిళ్ల కాక (వేడిమి) లేకపోతే దీనిని జయించడం మన వల్ల కానేకాదు, మనకిక పోడిమి (సౌఖ్యం) లేనే లేదని భావించారు కాబోలు, వారు తమ సతులను- సరస్వతీ, లక్ష్మీ, పార్వతులను (విరించి వాణిని వాక్కు (ముఖం) లోను, విష్ణువు శ్రీదేవిని వక్షఃస్థలంలోను, శివుడు శర్వాణిని ఏకంగా శరీరంలో సగ భాగంగానూ) తమ ఒంటికే- దేహానికే అంటగట్టుకొన్నారు. కాకపోతే ఆ త్రిమూర్తులు సదా ఆ స్త్రీమూర్తులతో అలా అవినాభావంగా ఎందుకు అలరారుతూ, అంటకాగుతూ ఉంటారు?



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

(సశేషం)

# పరిశుభ్రత.. ఉత్తమ సంస్కారం





ఇస్లాం బోధ

**పరిశుభ్రతను** ఉత్తమ సంస్కారంగా ఇస్లాం బోధిస్తుంది. 'పరిశుభ్రత ఇస్లామ్ ధర్మంలో సగ భాగం' అన్నారు మహనీయులు ముహమ్మద్ ప్రవక్త. పరిశుభ్రతను అలవరచుకున్నవారు అల్లాహ్‌కు ప్రేమపాత్రులని ఖురాన్ పేర్కొన్నది. 'ప్రభూ.. అత్యధికంగా క్షమాపణ వేడుకునే వారిలోనూ, పరిశుద్ధంగా, పరిశుభ్రంగా ఉండేవారిలోనూ నన్ను చేర్చు' అంటూ వేడుకోవాలనే విషయాన్ని ముహమ్మద్ ప్రవక్త నొక్కి చెప్పారంటే పరిశుభ్రతకు ఎంతటి ప్రాధాన్యం ఉన్నదో అర్థమవుతున్నది. నమాజ్ చేయడానికి కూడా పరిశుభ్రంగా సిద్ధం కావాలి. నమాజ్ ముందు చేసే వుజూలో బాహ్య అవయవాలను నీళ్లతో కడుక్కోవాలి. మిస్వాక్ పుల్లతో దంతావధానం చేయాలి. అపరిశుభ్రంగా ఉంటే స్నానం చేసి పరిశుద్ధులు కావాలి. ఉత్తమ సంప్రదాయ, సంస్కారాలను శరీరానికి అలంకరించుకోవాలి. శారీరక శుద్ధితో పాటు ఆత్మ శుద్ధి కూడా అవసరమని అల్లాహ్ ఖురాన్‌లో బోధించాడు. ఆత్మను అవిశ్వాసం, మార్గభ్రష్టతలాంటి చెడులకు దూరంగా ఉంచి, పవిత్ర భావాలతో నింపుకోవడమే ఆత్మశుద్ధి. ప్రతి రోజూ ఐదు పూటల నమాజుకు ముందు మిస్వాక్ పుల్లతో దంతాలు శుభ్రం చేసుకోవాలి. ప్రతి శుక్రవారం జుమా నమాజు కోసం తల స్నానం(గుసుల్) చేయాలి. గోళ్లు కత్తిరించుకోవడం, శుభ్రమైన దుస్తులు ధరించడం, అత్తరు పూసుకోవడం ఇవన్నీ జుమా మర్యాదలో భాగం. పరిశుభ్రమైన ఆహారాన్ని తినాలని ఖురాన్ పేర్కొంటున్నది. ఇల్లు, వాకిలి, వీధుల్లో, ప్రజలు తిరిగే ప్రదేశాల్లో చెత్త, చెదారాన్ని వేయరాదని ప్రవక్త పేర్కొన్నారు. నిద్ర నుంచి మేల్కొన్న తర్వాత చేతులు కడుక్కోకుండా నీటి పాత్రలో చేతులు పెట్టకూడదు. ఎవరితోనూ కరచాలనం చేయరాదు. స్నానాల గదిలో, స్నానాలు చేసేచోట మూత్ర విసర్జన చేసే అలవాటును మానుకోవాలి. తహారత్, గుసుల్, వుజూ పాటించడం వల్ల ఆధ్యాత్మిక అనుభూతితో పాటు శారీరక ఆరోగ్యమూ సొంతమవుతుంది.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

# మోక్షానికి అర్హత

**అన్ని** బంధాల నుంచి విడుదల కావడమే, మోక్షం. అందులోకి ఎవరు పడితే వారు తేలిగ్గా ప్రవేశించలేరు. ఎందుకంటే, కొందరు తమ బంధాల్ని, అనుబంధాల్ని తెంచుకోలేరు. వారికి ఆ మోక్ష ద్వారం తలుపులు తెరుచుకోవు. ఏన్నెన్ని కానుకలు ఇచ్చినా, ఎన్ని పూజలు చేసినా లభించని మోక్షం నిరాడంబరత, వినయం, అణకువ, దానం అనే గుణాలు ఉన్నవారు తేలిగ్గా మోక్ష ప్రవేశం చేయగలరని ప్రభువు పేర్కొన్నాడు. భౌతిక సంపన్నులు కాస్త తగ్గి తలదించక పోతే, వారికి మోక్ష ప్రాప్తి దొరకడం దుర్లభమని తెలిపాడు. 'ధనవంతుడు పరలోక రాజ్యంలో ప్రవేశించడం కన్నా.. సూది బెజ్జంలో ఒంటె దూరుట సులభమని మీతో చెప్పుచున్నాననెను' (మత్తయి సువార్త 19:24). సూదిబెజ్జం చిన్నది. స్థూలాకారంతో ఉండేది ఒంటె. భారీ శరీరం, పొడవాటి మెడ ఒంటెకున్న స్వరూప సంపద. అటువంటి భారీ ఒంటె కూడా చిన్న సూది బెజ్జంలోకి ప్రవేశించడం సులభం కానీ, ధనవంతుడు పరలోకంలోకి ప్రవేశించడం చాలా కష్టం అని ప్రభువు మాట. మరి ఆ ధనవంతుడికి మోక్ష ద్వారాలు తెరుచుకోవడం ఎలా? తన ధనాన్ని మొత్తం బీదలకు పంచి, ప్రభువాక్యం ప్రకారం నడుచుకున్నప్పుడు మాత్రమే పరలోకంలో కాస్తంత స్థానం లభిస్తుందని ప్రభువు పేర్కొన్నాడు. ధనవంతుడిగా పుట్టడం, ధనాన్ని ఆర్జించడం నేరం కాదు. కానీ, అది అవసరానుగుణంగా ఉండాలని క్రీస్తు సూచించాడు. ఉన్న సంపదను అవసరార్థులకు సద్వినియోగం చేస్తే మోక్షార్హత వస్తుందని సెలవిచ్చాడు.

... ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024

క్రీస్తు సందేశం

